# దర్జాగా పాగా!

## ప్రభుత్వ క్వార్టర్స్‌లో అనధికార వ్యక్తుల నివాసం

- 969 ప్రభుత్వ క్వార్టర్లు ఉండగా 40 శాతానికిపైగా వారే
- ప్రభుత్వ ఆదాయనికి భారీగా గండి
- పదవీ విరమణ చేసినా క్వార్టర్స్‌ను ఖాళీ చేయని రిటైర్డ్ ఉద్యోగులు
- చోద్యం చూస్తున్న అధికారులు

కర్నూలు (న్యూసిటీ): నగరం నడిబొడ్డున ఉన్న ఆర్ అండ్‌బీ క్వార్టర్స్‌లో అనధికారవ్యక్తులు తిష్ట వేశారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల నివాసం కోసం 1953–56 మధ్య కాలంలో 91 ఎకరాల్లో 1072 క్వార్టర్స్ నిర్మించారు. ఇందులో ఏ టైప్ క్వార్టర్స్ 176, బీ టైప్ 634, సీ టైప్ 103, (ఏ,బీ, సీ టైప్‌ల్లో (గెజిటెడ్ ఉద్యోగులు), డీ టైప్ 51 (జిల్లా అధికారులు, హాస్టళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు), ఈ టైప్ 10 (జిల్లా ఉన్నతాధికారులు), ఎంఐజీ టైప్ 5 (కిందిస్థాయి ఉద్యోగులు) ఉన్నాయి. ఇవన్నీ నగరంలోని ఏ,బీ,సీ, క్యాంపుల్లో ఉన్నాయి. దీంతో పాటు ఫారెస్ట్, ఫిషరీస్ కాంపౌండ్‌ల్లో ఏ టైప్ క్వార్టర్స్ 40, బీ టైప్ 14, సీ టైప్ 6, ఈ టైప్ 2, ఎఫ్ టైప్ 1 చొప్పున ఉన్నాయి.

**అనధికారికంగా తిష్ట**

ప్రభుత్వ క్వార్టర్స్‌లో దాదాపు 40 శాతం మంది ఇతరులే పాగా వేశారు. వీరు ఎలాంటి బడుగలు చెల్లించకుండా దర్జాగా కాపురాలు చేస్తున్నారు. కొందరు రిటైర్డ్ ఉద్యోగులు కూడా క్వార్టర్స్‌ను ఖాళీ చేయకుండా కొనసాగుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా వారిని అధికారులు ఖాళీ చేయించలేని పరిస్థితి. నామ్‌కేవాస్తే అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. చాలా క్వార్టర్స్ అనధికార వ్యక్తుల చేతుల్లో ఉండడంతో నిజమైన ఉద్యోగులు ప్రైవేట్ ఇళ్లలో వేలాదిరూపాయలు అద్దె చెలిస్తూ ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ఏటా రూ.3.24 కోట్ల ఆదాయానికి గండి**

ఆర్అండ్‌బీ క్వార్టర్స్‌లో నెలకు రూ.3 వేలు నుంచి 15 వేల వరకు హెచ్‌ఆర్‌ఏ (ఇంటి అద్దె) చెల్లించే కింది స్థాయి ఉద్యోగులు నుంచి జిల్లా అధికారులు 519 క్వార్టర్స్‌లో ఉంటున్నారు. వీరు జీతంలో హెచ్‌ఆర్‌ఏ డ్రా చేయరు. ఈ హెచ్‌ఆర్‌ఏ సరాసరి నెలకు రూ.6 వేల చొప్పున 519 క్వార్టర్స్‌కు గాను నెలకు రూ.31 లక్షల చొప్పున ఏడాదికి రూ.3.73 కోట్లపైనే ఆదాయం ప్రభుత్వ ఖాజానాలో ( రెవెన్యూ హెడ్‌కు) చేరిపోతుంది. అయితే, మిగతా 446 భవనాల్లో అనధికారికంగా ఇతరులు ఉన్నారు. వీరు అద్దె చెల్లించకుండా నివాసముండడంతో నెలకు రూ.27 లక్షలు చొప్పున ఏడాదికి రూ.3.24 కోట్లు ప్రభుత్వ ఖాజానకు గండిపడుతోంది. ప్రభుత్వం మాత్రం ఆయా క్వార్టర్ల నిర్వహణ, మరమ్మతులకు ఏటా రూ.కోటి వరకు నిధులు కేటాయిస్తోంది.

**కొరవడిన పర్యవేక్షణ**

1980 నుంచి క్వార్టర్స్‌కు సంబంధించి అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు కల్పన తదితరవి మున్సిపాలిటీ చూసుకుంటుంది. అయితే, కొన్నేళ్ల నుంచి సరైన పర్యవేక్షణ లేకపోవడంతో క్వార్టర్స్ దెబ్బతింటున్నాయి. వానాకాలంలో కొన్ని భవనాలు కారుతున్నాయి. కొద్దిపాటి వర్షం వస్తే మురుగు నీరు కాంపౌండ్‌లో నిలిచిపోతుంది. అపరిశుభ్రతతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి.



సీ క్యాంప్ రైతు బజార్ వెనుక ఉన్న క్వార్టర్స్



బీ క్యాంప్‌లో అనధికారికంగా నివాసముంటున్న క్వార్టర్

> **రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం**
>
> ఏ,బీ,సీ క్వార్టర్స్‌లో కొంతమంది అనధికారికంగా ఉంటున్నారు. వీరిని ఖాళీ చేయించాలని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాము. దాదాపు 60 ఏళ్ల కిందట నిర్మించిన భవనాలు కావడంతో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం.
>
> – రవిచంద్ర, డీఈ, ఆర్అండ్‌బీ

## క్లుప్తంగా

### స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నగరూరు శ్రీనివాసరావు



మేయర్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న నగరూరు శ్రీనివాసరావు

కర్నూలు (టౌన్) : నగరపాలక స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా నగరూరు శ్రీనివాసరావు నియామక పత్రం అందుకున్నారు. రెండు రోజుల క్రితం స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన నలుగురు డిక్లరేషన్ ఫారాలు అందుకున్నారు. కాగ శ్రీనివాసరావు అందుబాటులో లేకపోవడంతో శనివారం స్థానిక నగరపాలకలోని మేయర్ చాంబర్‌లో మేయర్ బీవై. రామయ్య, నగరపాలక మేనేజర్ చిన్నరాముడు చేతుల మీదుగా అందుకున్నారు.

### మున్సిపల్ కార్మికులకు రెయిన్‌కోట్లు



పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కైపా పద్మాలతారెడ్డి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 17 వ వార్డులో పనిచేసే మున్సిపల్ కార్మికులకు శనివారం కార్పొరేటర్ కైపా పద్మాలతా రెడ్డి రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. స్థానిక ఏ.క్యాంపులోని తన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో వానకు తడస్తూ కార్మికులు విధులు నిర్వహిస్తుంటారన్నారు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రెయిన్‌కోట్లు అందించినట్లు చెప్పారు. ఇప్పటికే కార్మికులకు నగరపాలక సంస్థ రూ.10 లక్షలు విలువ చేసే బీమా సౌకర్యాన్ని ఉచితంగా కల్పించినట్లు చెప్పారు.

### ఆర్‌ఏఎఫ్ కవాతు



కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్‌ఏఎఫ్ కవాతు

కర్నూలు : హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్‌లో భాగమైన రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) కర్నూలు నగరంలో శనివారం రెండో రోజు కూడా కవాతు నిర్వహించింది. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఆర్‌ఏఎఫ్ డిప్యూటీ కమాండెంట్ టి.పి.బఘేల్, సీఐ మురళీధర్‌రెడ్డి కవాతు ప్రారంభించారు. అక్కడి నుంచి మద్దూర్ నగర్, సి.క్యాంప్, బిర్లాగడ్డ, గాయత్రి ఎస్టేట్, ప్రభుత్వాసుపత్రి మీదుగా తిరిగి పోలీస్‌స్టేషన్ వరకు కవాతు సాగింది. ఈ సందర్భంగా సీఐ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు నగర భౌగోళిక పరిస్థితులు, అంశాలపై అవగాహన కోసం ఆర్‌ఏఎఫ్ దళాలు రెండు రోజులుగా కర్నూలులో కవాతు నిర్వహించాయన్నారు. ముగ్గురు సీఐలు, 8 మంది ఎస్‌ఐలు, 60 మంది ఆర్‌ఏఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు. వివిధ రకాల ఆయుధాలతో పాటు వజ్ర వాహనం కూడా కవాతును అనుసరించింది.

### ఈ-హాస్పిటల్‌పై వైద్యులకు శిక్షణ



కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శివబాల నాగాంజన్

కర్నూలు(హాస్పిటల్): ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఈ-హాస్పిటల్ నిర్వహణపై కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని వైద్యులకు శిక్షణ ఇచ్చారు. శనివారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ప్రారంభించారు. ఈ-హాస్పిటల్‌తో ఉపయోగాల గురించి ఆయన వివరించారు. దీనివల్ల వైద్యసేవలు మరింత సులభతరమవుతాయని చెప్పారు. అనంతరం క్లినికల్ మాడ్యుల్స్‌పై ఎన్ఐసీ ప్రోలేట్ మేనేజర్ జీవన్ పవర్ పాయింట్ ప్రాజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, జనరల్ సర్జరీ హెచ్‌ఓడీ డాక్టర్ హరిచరణ్, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఇక్బాల్ హుసేన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

### దూర విద్య కేంద్రం ఏర్పాటు

కల్లూరు : దూపాడు సమీపంలోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజిమెంట్ (ఎంబీఏ) కళాశాలలో సింబయాసిస్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ, పుణె వారికి అనుబంధంగా దూర విద్య కేంద్రం ఏర్పాటు చేశామని కళాశాల చైర్మన్ విశ్వమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 2023–2024 నుంచి కేంద్రం ప్రారంభమవతుందన్నారు. మరిన్ని వివరాలకు 7680076627, 7680076603 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## గుండెపోటు మరణాలను అరికట్టేందుకు స్టెమి ప్రోగ్రామ్



మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటు మరణాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో స్టెమి ప్రోగ్రామ్ ప్రారంభించనుందని స్టెమి ప్రోగ్రామ్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ మునీశ్వరరెడ్డి చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజిలోని క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో శనివారం కార్డియాలజి, జనరల్ మెడిసిన్ విభాగాల ఆధ్వర్యంలో స్టెమి ప్రోగ్రామ్‌పై కర్నూలు, నంద్యాల జిల్లాల సీహెచ్‌సీలలో పనిచేసే వైద్యులు, స్టాఫ్‌నర్సులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మునీశ్వరుడు మాట్లాడుతూ స్టెమి అనేది హార్ట్ ఎటాక్‌లలో ఒకరకమైనదన్నారు. ఈ గుండెపోటు వచ్చిన నాలుగు గంటల్లో రోగిని ఆసుపత్రికి తీసుకొచ్చి టెనెక్టప్లేస్(టీపీఏ) అనే ఇంజెక్షన్ ఇస్తే కోలుకునే అవకాశం ఉందన్నారు. ఈ ఇంజెక్షన్‌ను ఎలా వాడాలి, గుండెపోటు వచ్చిన రోగికి ఎలాంటి వైద్యం అందించాలి అనే విషయాలపై వైద్యులు, స్టాఫ్‌నర్సులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, బేతంచర్ల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు, పత్తికొండ, వెల్దుర్తి, కోడుమూరు, ఓర్వకల్, పాణ్యం, వెలుగోడు, మిడుతూరు సీహెచ్‌సీలలో స్టెమి ప్రోగ్రామ్‌ను త్వరలో ప్రారంభించనున్నామన్నారు. ఆయా కేంద్రాల్లో స్టెమి ప్రోగ్రామ్‌కు సంబంధించిన వసతులు, పరికరాలను సమకూర్చనున్నట్లు చెప్పారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సమీప సీహెచ్‌సీకి తరలిస్తే అవసరమైన ప్రాథమిక వైద్యం చేసి టీపీఏ ఇంజెక్షన్ ఇస్తారని, ఆ వెంటనే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేస్తారన్నారు. తద్వారా గుండెపోటు మరణాలను సాధ్యమైనంతగా అరికట్టవచ్చన్నారు. అనంతరం స్టెమి ప్రాజెక్టు గురించి కార్డియాలజి హెచ్‌ఓడీ డాక్టర్ పి. చంద్రశేఖర్ పవర్‌పాయింట్ పాజెక్టర్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ మహేశ్వరరెడ్డి, కార్డియాలజిస్టు డాక్టర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### తెలంగాణ మద్యం పట్టివేత

కర్నూలు: నగర పరిధిలోని బుధవారపేటకు చెందిన పిక్కలి రామాంజనేయులు హంద్రీ బ్రిడ్జి కింద తెలంగాణ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మూడో పట్టణ పోలీసులు కాపు కాసి అతనిని అదుపులోకి తీసుకున్నారు. పుల్లూరు టోల్ ప్లాజా దగ్గర ఉన్న దుకాణంలో తెలంగాణ మద్యం కొనుగోలు చేసి కర్నూలులో ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు విచారణలో నిందితుడు అంగీకరించాడు. అతని వద్ద ఎనిమిది మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు.

### మట్కాబీటర్ అరెస్ట్

కర్నూలు : నగరంలోని బుధవారపేటకు చెందిన మట్కా బీటర్ బోయ మధుబాబు అలియాస్ బబ్లూను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. బుధవారపేటలో పడిపోయిన కమాన్ల దగ్గర కంప చెట్లలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ రవూఫ్, ఏఎస్ఐ కృష్ణమోహన్‌రెడ్డి తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద మట్కా చీటీతో పాటు రూ.5 వేలు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

### శిశువు అనుమానాస్పద మృతి

కర్నూలు : కర్నూలు శివారులోని గుత్తి పెట్రోల్ బంకు దగ్గర నివాసముంటున్న కుమ్మరి రమేష్‌కు గౌరీగోపాల్ హాస్పిటల్‌లో కుమారుడు జన్మించాడు. ఈయనకు 2016లో వివాహమైంది. భార్య శివపార్వతి శనివారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా గౌరీగోపాల్ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు సిజేరియన్ చేసి మగ శిశువు జన్మించాడని చెప్పి కొద్దిసేపటి తర్వాత అబ్బాయికి సీరియస్‌గా ఉందని ఐసీయూలోకి తీసుకెళ్లారు. తొమ్మిది గంటల సమయం దాటిన తర్వాత డాక్టర్లు శిశువు చనిపోయాడని చెప్పారని, అయితే తన కొడుకు మరణంపై అనుమానం ఉందని రమేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కుడివైపు కడుపు దగ్గర కోసిన గాయం ఉందని, తన కుమారుడి మరణంపై సరైన కారణం కనుగొని న్యాయం చేయాల్సిందిగా ఆయన ఫిర్యాదులో పేర్కొనడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు మూడవ పట్టణ పీఎస్ మహిళా ఏఎస్ఐ దేవకృప తెలిపారు.

## బీఈడీ విద్యార్థులకు ముగిసిన వర్క్‌షాపు

కర్నూలు సిటీ: ప్రభుత్వ అత్యున్నత విద్యా అధ్యయన సంస్థ (ప్రభుత్వ ఐఏఎస్ఈ-బీఈడీ కాలేజి)లో రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (బెంగళూరు)వారి సహకారంతో బీఈడీ విద్యార్థులకు 'ఇంటరాక్టివ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ స్ట్రాటజీస్ ఫర్ టీచర్ ట్రైనీస్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. ఈ నెల 2వ తేదీన మొదలైన ఈ జాతీయ వర్క్‌షాపు రెండు విడతల్లో నిర్వహించారు. ఇందులో ఛాత్రోపాధ్యాయులు సాంకేతిక సాధనలతో నిర్వహించే నూతన బోధన పద్ధతులుపై శిక్షణ పొందారని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డా.ఆర్ ఆదినారాయణరెడ్డి తెలిపారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ రంగమ్మ, ట్రైనర్స్ సత్యనారాయణ, బాలరాజు, కరీమా అంజుమ్ కన్వీనర్లు డా.జి నాగలక్ష్మమ్మ, డా.మధుసూదన్, డా.వై కల్యాణ్ కుమార్, వనంరాజు, మహమ్మద్ రఫీక్, సుధీర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

## లైజన్ ఆఫీసర్‌గా పి.మురళీ

కర్నూలు టౌన్ : నగరపాలక లైజన్ ఆఫీసర్‌గా పి. మురళీని ప్రభుత్వం నియమించింది. మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకులు కోటేశ్వరరావు ఉత్తర్వులు జారీ చేసినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఆయనను నగరపాలకలో ఆడిట్ నిర్వహణకు నియమించినట్లు తెలిపారు.

## రేకుల షెడ్డు పైనుంచి పడి కూలీ మృతి



ప్రమాదంలో మృతిచెందిన చిన్నమద్దిలేటి

కర్నూలు : కర్నూలు మండలం గొందిపర్ల మజరా పూలతోట గ్రామానికి చెందిన బోయ చిన్న మద్దిలేటి రేకుల షెడ్డు పైనుంచి కింద పడి మృతి చెందాడు. గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని వెంకటేశ్వర కళ్యాణ మండపం దగ్గర శనివారం మధ్యాహ్నం రేకుల షెడ్డు నిర్మాణ పనులకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కింద పడి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈయనకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. భార్య బోయ లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్షిప్తం

### సజావుగా ఎస్ఎస్ఆర్

కర్నూలు(సెంట్రల్) : ఓటరు జాబితా సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్–2024) సజావుగా సాగుతున్నట్లు ఆర్‌డీఓ డి.హరిప్రసాదు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ..10 ఓట్ల కంటే ఎక్కువగా ఉన్న ఇళ్లు, 100 ఏళ్లు దాటిన ఓటర్లపై ప్రత్యేక పరిశీలన చేస్తున్నామన్నారు. కొన్ని పత్రికల్లో ఓటరు సవరణ జాబితాపై వస్తున్న ప్రతికూల అంశాలపై చేస్తున్న విచారణల్లో నిజం లేదన్నారు. సాంకేతికంగా కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని ప్రస్తుతం జరుగుతున్న సవరణలో సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కర్నూలు డివిజన్‌లో ఇప్పటి వరకు దాదాపు 25 వేల కుటుంబాలను బీఎల్‌ఓలు సందర్శించినట్లు చెప్పారు.

### వృద్ధురాలికి అరుదైన చికిత్స

కర్నూలు(హాస్పిటల్):ఎముకలు మెత్తబడటంతో కిందపడి ఫ్రాక్చర్ అయిన 68 ఏళ్ల వృద్ధురాలికి కర్నూలులోని అగ్రసేని హాస్పిటల్‌లో అరుదైన చికిత్స చేశారు. శనివారం ఆ హాస్పిటల్‌లో వెన్నుముక శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ టి. రాఘవేంద్రరావు వివరాలు వెల్లడించారు. 'హీరాబాయి అనే 68 వృద్ధురాలు ఇటీవల కింద పడటంతో వెన్నుముక ఫ్రాక్చర్ అయ్యింది. ఈ ఫ్రాక్చర్‌కు మూడు నెలల విశ్రాంతి అవసరం. దీని వల్ల రోగికి మెడికల్ కాంప్లికేషన్స్, చర్మంపై పుండ్లు వచ్చే అవకాశం ఉంది. అలా అని పెద్ద సర్జరీ చేస్తే పెద్దవయస్సు వారు తట్టుకోలేరు. దీంతో ఈ నెల 2వ తేదీన ఆమెకు అడ్వాన్స్ ప్రొసీజర్ నిర్వహించాము. ఒకే ఒక సూది ద్వారా విరిగిన వెన్నుముకను అతికించి రాడ్లు, స్క్రూలు, నొప్పి లేకుండా మరుసటి రోజు రోగిని నడిపించాము. ఈ చికిత్స ద్వారా రోగి ఇంట్లో వారి పనులు వారే చేసుకోవచ్చు. ఇలాంటి చికిత్సను రాయలసీమలో మొదటిసారిగా నిర్వహించాము' అని ఆయన పేర్కొన్నారు.

### విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

కర్నూలు(రాజ్‌విహార్): సమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన శనివారం కూడా కొనసాగింది. వర్క్ టు రూల్ కార్యక్రమంలో భాగంగా పని వేళల్లో మాత్రమే కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన ఆగదని విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గణేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ లక్ష్మీకాంత్‌రెడ్డి, కార్యదర్శి రంగస్వామి, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. పవర్ హౌస్‌లో ఉద్యోగులు శనివారం సాయంత్ర నిరసన కార్యక్రమం చేపట్టారు.

### హాకీ క్రీడను గుర్తించాలి

కర్నూలు(రూరల్): హాకీ క్రీడను గుర్తించి ఎంసెట్, నీట్ ప్రవేశాల్లో స్పోర్ట్స్ కోట కింద సీట్లు కేటాయించాలని హాకీ కర్నూలు జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ కోరారు. హాకీ క్రీడాకారులకు క్రీడా కోట రద్దు చేయడంతో సంఘం సభ్యులు హైకోర్టుకు వెళ్లారన్నారు. దీనిపై క్రీడా కోటను కల్పించాలని కోర్టు తీర్పు కూడా ఇచ్చిందన్నారు. ఇది అమలయ్యేలా ప్రభుత్వం చూడాలని కోరారు.

### నేడు కర్నూలు రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల ప్రారంభం

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను ఆదివారం ప్రారంభించనున్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌గా దీనిని అభివృద్ధి చేయనున్నారు. దేశవ్యాప్తంగా 508 రైల్వే స్టేషన్లు ఎంపిక కాగా అందులో కర్నూలు సిటీ స్టేషన్‌కు చోటు దక్కింది. దీని శిలా ఫలకాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రారంభించనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యుత్ సమాచారం

### నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఈఈ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అభివృద్ధి పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గణేష్ నగర్, శ్రీరామ్ నగర్, రెవెన్యూ కాలనీ, పోస్టల్ కాలనీ, జయరాం నగర్, నంద్యాల చెక్ పోస్టు ఏరియా, డాక్టర్స్ కాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ, పార్థసారథి కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

## విన్నపం

### ఉద్యోగ భద్రత కల్పించండి



హౌసింగ్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): గృహ నిర్మాణ సంస్థలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వామనగిరి హనుమన్న కోరారు. శనివారం హౌసింగ్ డైరెక్టర్ రమాదేవిని కలిసి ప్రతి నెల రూ.5 వేలు ఎఫ్‌టీఏ ఇవ్వాలని, ఏఈ/ ఎంఐసీలకు అదనపు జీతాలు ఇవ్వాలని, జాబ్‌చార్ట్ కల్పించాలని వినతిపత్రం అందజేశారు.

## స్పోర్ట్స్

### రగ్బీ క్రీడలో రాణించాలి

కర్నూలు(రూరల్): విద్యార్థులు రగ్బీ క్రీడలో రాణించాలని రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. శనివారం నగరంలోని దేవనగర్ గుడ్ షెపర్డ్ స్కూల్‌లో గెట్ ఇన్ రగ్బీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రగ్బీ శిక్షకుడు నాగ శ్రీనివాసులు, స్కూల్ కరస్పాండెంట్ మిన్నెల, పీఈటీ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం

### 31,856 హెక్టార్లలో పంటల సాగు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్‌లో ఖరీఫ్ పంటల సాగు జోరుగా సాగుతోంది. ఇప్పటి వరకు 43.55 శాతం సాగు పూర్తి అయింది. సబ్ డివిజన్‌లో కర్నూలు, కల్లూరు, గూడూరు, కోడుమూరు, సి.బెళగల్, ఓర్వకల్ మండలాలు ఉన్నాయి. కర్నూలు సబ్ డివిజన్‌లో ఖరీఫ్ సాగు వివరాలను ఏడీఏ సాలురెడ్డి విలేకర్లకు తెలిపారు. సాధారణ సాగు 74,149 హెక్టార్లు ఉండగా... 31856.49 హెక్టార్లలో పంటలు సాగు అయ్యాయి.వర్షాధారం కింద 25,255.35 హెక్టార్లు, నీటి ఆధారం కింద 6601.14 హెక్టార్లలో పంటలు సాగు అయినట్లు స్పష్టమవుతోంది. కంది 4,330 హెక్టార్లు, మొక్కజొన్న 1,723.2, ఉల్లి 2,757.3, పత్తి 18,851,ఆముదం 1,102.2, మిరప 482.4 హెక్టార్లలో సాగు అయ్యా యి. ఇటీవల ఆశాజనకంగా వర్షాలు పడటంతో పంటల సాగు ఊపందుకుందని, మరో 10 రోజుల్లో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందన్నారు.



## సాంకేతికతను అందిపుచ్చుకుందాం

- నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ



శిక్షణ పొందిన సచివాలయాల ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : సమకాలీన అంశాలు, సాంకేతికతపై పట్టు పెంచుకుని ప్రజలకు మెరుగైన పాలన అందిద్దామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం స్థానిక సీతారామనగర్‌లోని స్కిల్ డెవలప్‌మెంటు కార్యాలయంలో 1 నుంచి 23 సచివాలయాలకు చెందిన అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శులు, శానిటేషన్ కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ వృత్తిలో రాణించాలంటే వృత్తికి సంబంధించిన నైపుణ్య విలువలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌ఓ జునీద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజు, కోఆర్డినేటర్ వాసు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి



కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): శిక్షణ పొందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో ఆరు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం పూర్తయిన సందర్భంగా శనివారం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు సమన్వయంతో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలోని ఆరోగ్యసేవలను సమయానుసారంగా అందించాలని ఆదేశించారు. అత్యవసర సేవలను మరింత నాణ్యతగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు, డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, నోడల్ అధికారులు ఐజాల్ హక్, సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు రుక్మిణి, సరళ, అరుణ, నారాయణమ్మ పాల్గొన్నారు.